సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 19 । జనవరి । 2023



కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు

ఈ నెల 22న జరగనున్న కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. బుధవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

- 8లో



స్టాఫ్‌నర్సుల ఎంపికలు నిలుపుదల

స్టాఫ్‌నర్సుల పోస్టుల భర్తీ తాత్కాలికంగా నిలిచిపోయింది. తమకు అన్యాయం జరిగిందని కొందరు అభ్యర్థులు నిరసన వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

- 8లో

నేడు శాప్‌లీగ్ వాలీబాల్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం శాప్‌లీగ్ వాలీబాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పురుషుల విభాగంలో(21 ఏళ్ల లోపు) ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవ్యవస్థలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. పారాలీగల్ వలంటీర్ అనేది ఉద్యోగం కాదని, స్వచ్ఛంద సేవా కార్యక్రమమని గుర్తించాలన్నారు. ఎటువంటి జీత భత్యాలు చెల్లించరని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాయలంలో ఈ నెల 28లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నడకలో అ'ద్వితీయ' ప్రదర్శన

- అంతర్జాతీయ పోటీల్లో రజత పతకం సాధించిన లావేరు ఉపాధ్యాయుడు



రజత పతకంతో సుధాకర్

లావేరు: అంతర్జాతీయ నడక(రేస్ వాకింగ్) పోటీల్లో లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సంజీవిని నళిని సుధాకర్ రజత పతకం సాధించారు. శ్రీలంక దేశంలోని కొలంబో నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన 36వ అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 5 కిలోమీటర్ల నడక విభాగంలో సుధాకర్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నారు. భారత డిప్యూటీ కమిషనర్ ఇల్డోస్ మాథ్యూస్, భారత జట్టు మేనేజరు ఉదయ్‌కుమార్‌శెట్టి తదితరులతో ప్రత్యేక అభినందనలు అందుకున్నారు. ఈ పోటీలకు భారత్ నుంచి 40 మంది ఎంపిక కాగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి సుధాకర్ మాత్రమే ప్రతిభ కనబరిచారు. 45 ఏళ్ల జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ చరిత్రలో రేస్ వాకింగ్ పోటీల్లో అంతర్జాతీయ పతకం తొలివ్యక్తిగా గుర్తింపు సాధించారు. సుధాకర్‌ను లావేరు హైస్కూల్ హెచ్‌ఎం పి.రాజారావు, ఉపాధ్యాయులు, అధికారులు బుధవారం అభినందించారు.

సుసరాంలో ఎలుగుబంట్ల కలకలం



స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న అటవీ అధికారులు

పోలాకి: మండలంలోని సుసరాం గ్రామంలో కొన్నిరోజులుగా రాత్రిపూట ఎలుగుబంట్లు సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా అటవీశాఖ అధికారి ఆదేశాల మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ బుధవారం సుసరాంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. జనసంచారానికి అలవాటు పడిన ఎలుగుబంట్లతో పెద్దగా ప్రమాదం ఉండకపోవచ్చని, కేవలం ఆహారం కోసమే గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు రాత్రిపూట పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. ఎలుగు బంట్ల సమాచారాన్ని మెయిల్ ద్వారా తెలియజేసిన యువకుడు విద్యాధర్‌రావును అభినందించారు. కార్యక్రమంలో డీఎల్‌పురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఏఎఫ్‌బీఓ ఎస్.వి.రమణమూర్తి, సర్పంచ్ దుంపల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

1న జిల్లా స్థాయి విష్ణు సహస్రనామ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం పది గంటలకు శ్రీకాకుళంలోని టీటీడీ కల్యాణం మండపంలో విష్ణు సహస్రనామ స్తోత్రంపై పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని పరిషత్ సూపరింటెండెంట్ ఎ.వెంకటరమణ, సమన్వయకర్త ఎం.లలితామణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. అలాగే పదేళ్లలోపు విద్యార్థులకు అచ్యుతాష్టకంపై పోటీలు ఉంటాయన్నారు. ఈ రెండు గ్రూపులలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. వివరాల కోసం 98669 14160, 95537 45950 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

● జనరంజకంగా

సప్తమి సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- క్యూలైన్లు, సౌకర్యాలు పక్కాగా ఉండాలి
- వీఐపీలకు ప్రత్యేకంగా రూ.500 దర్శన టికెట్లు
- సమన్వయ సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అరసవల్లి: భక్తులు మెచ్చుకునే స్థాయిలో రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ, వైద్యారోగ్య, మున్సిపల్ కార్పొరేషన్, అగ్నిమాపక, మత్స్య తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా దర్శనాల రూట్‌మ్యాప్ వివరాలను ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ పలు సూచనలు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈసారి ప్రత్యేకంగా వీఐపీల కోసం రూ.500 టికెట్లను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. వీటిని ఆర్డీఓ ఆధ్వర్యంలో అరసవల్లిలోని బ్యాంకుల వద్ద కొనుగోలు చేసుకుని ప్రత్యేక వీఐపీ మార్గం నుంచి దర్శనాలు చేసుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

- ఈ నెల 27వ తేది అర్ధరాత్రి 12.30 గంటల నుంచి 28వ తేది రాత్రి 10 గంటల వరకు ఉత్సవం ఉంటుంది. అత్యవసర శాఖలైన కార్పొరేషన్, విద్యుత్, పోలీస్, వైద్యశాఖ తదితర విభాగాలు షిఫ్టుల కింద విధుల్లో ఉండాలి.
- ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశాలున్నందున పోలీసులతో కలిసి దేవదాయశాఖ సమన్వయ చర్యలు చేపట్టాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, డ్రోన్స్‌తో పరిస్థితులపై నిఘా ఉంచాలి.
- భక్తులకు అత్యవసర సేవలతో పాటు ప్రాథమిక చికిత్స అందించేలా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రతి క్యూలైన్ వద్ద, తిరిగొచ్చే మార్గంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి.
- ఆలయ, బయట పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు వ్యర్థాలను ఎత్తివేసేలా వాహనాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- 80 ఫీట్ రోడ్డులో వాహనాల పార్కింగ్, డీసీఎంఎస్ కార్యాలయం నుంచి ప్రారంభం కానున్న క్యూలైన్ల వద్ద టికెట్ల కౌంటర్లు, భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలి.
- ఆలయ దాతలకు ప్రత్యేక పాసులు ఉండటంతో వారికి సజావుగా విశిష్ట దర్శనాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలి.
- గత ఏడాది తరహాలోనే సాధారణ భక్తుల దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాట్లు చేయాలి. దివ్యాంగులు, వృద్ధులను ప్రత్యేక వాహనాల ద్వారా దర్శనాలకు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలి.
- అరసవల్లి నగర పాలకోన్నత పాఠశాల నుంచి రూ.100 టికెట్ల ద్వారా దర్శనాలు, ఉచిత దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణికి ఆగ్నేయ ద్వారం నుంచి ఉచిత దర్శనాలు, ఈశాన్య ద్వారం నుంచి రూ.100 దర్శన టికెట్ల మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు.
- రూ.500 (క్షీరాభిషేక సేవ), దాతల పాసులు, వీవీఐపీలకు ఆలయ ప్రధాన ఆర్చిగేటు ద్వారానే దర్శనాలకు అనుమతించనున్నారు. ఈ మేరకు సూచన బోర్డులు పెట్టించాలి.
- నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. సిబ్బందిని అందుబాటులో ఉంచాలి.
- ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆర్టీసీ బస్సులను కళింగపట్నం రోడ్డు నుంచి వచ్చే వాహనాలను దారి మళ్లింపు చర్యలు తదితర ఏర్పాట్లు చేయాలి.

సమావేశంలో దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, ఎస్పీ జీఆర్.రాధిక, ఆర్డీవో బి.శాంతి, కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా దేవదాయ శాఖాధికారి డి.వి.వి.ప్రసాదరావు, ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, డీఎస్పీలు మహేంద్ర, బాలరాజు, ప్రసాద్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, తహశీల్దార్ వెంకటరావు, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, ఫైర్ ఆఫీసర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● సామాన్యులకు పెద్దపీట

- ఏర్పాట్ల పరిశీలనలో ఆర్‌జేసీ, ఎస్పీ

అరసవల్లి: ఆదిత్యుని ఆలయంలో ఈ నెల 28న జరగనున్న రథసప్తమి మహోత్సవ ఏర్పాట్లను బుధవారం దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.వి.సురేష్ బాబు, ఎస్పీ జి.ఆర్.రాధిక పరిశీలించారు. వివిధ దర్శనాల మార్గాలు, టికెట్ల విక్రయ కేంద్రాలు, వీఐపీ, వీవీఐపీ దర్శన మార్గాలు, సాధారణ దర్శన క్యూలైన్లు, కేశఖండన శాల, ఇంద్రపుష్కరిణితో పాటు వాహనాల పార్కింగ్ తదితర ప్రదేశాలను, ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ మాట్లాడుతూ సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చేలా ఏర్పాట్లు ఉండాలని, క్యూలైన్ల వద్దే ఉచితంగా పాలు, మంచినీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. తగిన సిబ్బందిని ముందుగానే డిప్యూట్ చేసుకోవాలని జిల్లా దేవదాయ శాఖ అధికారి డి.వి.వి.ప్రసాదరావు, ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌లను ఆదేశించారు. అనంతరం ఎస్పీ రాధిక మాట్లాడుతూ భక్తుల పాదరక్షలు, సెల్‌ఫోన్లను భద్రపరిచేలా క్లాక్ రూమ్‌లు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలతో వచ్చిన భక్తులకు ప్రత్యేకంగా దర్శనాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం భక్తులు రాకపోకల మార్గాలను అధికారులు పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహేంద్ర, బాలరాజు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీఐ ఎల్‌ఎస్.నాయుడు, ఎస్సై బి.గణేష్ తదితరులున్నారు. అంతకుముందు ఆదిత్యున్ని దేవదాయ శాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు దర్శించుకున్నారు. ఈవో, ప్రధానార్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.



రథసప్తమి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్‌జేసీ సురేష్‌బాబు, ఎస్పీ రాధిక

పోలీసు లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



మోహనరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

సరుబుజ్జిలి: గుండెపోటుతో రాజస్థాన్‌లో మరణించిన జవాన్ పూజారి మోహనరావు అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో స్వగ్రామం పురుషోత్తపురంలో బుధవారం నిర్వహించారు. సరుబుజ్జిలి ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డు సిబ్బంది గాలిలో కాల్పులు జరిపి అంత్యక్రియలు జరిపించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.

ఫిబ్రవరిలో టిడ్కో ఇళ్లు ప్రారంభం

- 1280 మంది లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు
- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ వెల్లడి

శ్రీకాకుళం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టిడ్కో ఇళ్లను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. శ్రీకాకుళం పరిధిలోని పాత్రునివలసలో నిర్మించిన టిడ్కో ఇళ్లను బుధవారం పరిశీలించారు. ముందుగా జగనన్న నగర్‌లో జీ–3 గృహాలను సందర్శించి ఎస్‌టీపీ పనులపై సిబ్బందితో చర్చించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, గ్రీనరీ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న 1280 టిడ్కో ఇళ్లను ఫిబ్రవరి నాటికి అందజేస్తూ అక్కడే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పాత్రునివలసలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ఆర్టీసీ స్థలం లీజుకు టెండర్లు ఆహ్వానం



వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎం రవిశంకర్‌శర్మ

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాన్ని 15 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు వ్యాపారుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ కె.రవిశంకర్ శర్మ తెలిపారు. బుధవారం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు విజయనగరం ఈడీ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో టెండర్ అందజేయాలని, అదే రోజు సాయంత్రం మూడు గంటలకు టెండర్ తెరుస్తామని చెప్పారు. జిల్లాలో ఇచ్ఛాపురంలో రెండు, కవిటి, సోంపేట, పలాస, టెక్కలి, పాతపట్నంలో ఉన్న ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళం ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బి.నారాయణమూర్తి, నట్టు, కిరణ్, వెంకటరమణ, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సత్ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు తమకు నిర్దేశించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో సమన్వయంతో నిర్వహించి సత్ఫలితాలు సాధించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జగనన్న సచివాలయ కన్వీనర్లు, మండల ఇన్‌చార్జిలతో పార్టీ రాష్ట్ర పరిశీలకులు హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి సమావేశం జరిగింది. దీనికి పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, 30 మండలాలకు నియమించిన పార్టీ మండల కో–ఆర్డినేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి, కృష్ణదాస్‌లు మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచే పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఎటువంటి వ్యూహాలు అనుసరించాలో వాటిని కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా అన్ని సచివాలయాల పరిధిలో గృహసారధుల నియమకాలు పూర్తి చేయాలన్నారు. ఆ జాబితాలను ఈ నెల 24వ తేదీలోగా జిల్లా పార్టీ కార్యాలయానికి అందజేసే బాధ్యత ఇన్‌చార్జిలదేనన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నాయని.. అదే తరహాలో పార్టీ కార్యక్రమాలు, ఆశయాలు ప్రజల మనసుల్లో నిలిచిపోయేలా అంకితభావంతో కృషి చేయాలన్నారు. సమావేశంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్, నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, తమ్మినేని చిరంజీవినాగ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ప్రసన్నకుమార్ (ఇచ్ఛాపురం), కేవీ సూర్యనారాయణ (పలాస), కాయల వెంకటరెడ్డి (టెక్కలి), పి.వి.సూర్యనారాయణరాజు (పాతపట్నం), డి.వి.జి.శంకరరావు (శ్రీకాకుళం) పాల్గొన్నారు.

● జనజాతర

పురుషోత్తపురంలో ఉమాకామేశ్వరి స్వామి రథయాత్ర అనంతరం నిర్వహించే వీధిజాతరకు బుధవారం జనాలు పోటెత్తారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. – సరుబుజ్జిలి



దోపిడీ దొంగల బీభత్సం

- పెట్రోల్ కావాలంటూ ఇంట్లో చొరబాటు
- వృద్ధురాలి మెడపై కత్తిపెట్టి బంగారు చైను, పుస్తెలతాడు, నగదు అపహరణ
- అడ్డుకున్న భర్తపై విచక్షణ రహితంగా దాడి
- వివరాలు సేకరించిన పోలీసులు





దుండగులు వదిలేసిన కత్తి

మెళియాపుట్టి: దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. మెళియాపుట్టి మండలం దీనబంధుపురం పంచాయతీ డేగలపోలూరు ప్రాంతంలో రోడ్డును ఆనుకుని ఉన్న ఇంట్లో చొరబడి బంగారం, నగదును దోచుకోవడమే కాకుండా అడ్డుపడిన వ్యక్తిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధులైన సేనాపతి దుర్యోధన, శ్రీదేవి దంపతులు ఇంట్లోనే కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు వచ్చి పెట్రోల్ కావాలని అడిగారు. దీంతో శ్రీదేవి ఇంటి లోపలకు వెళ్లగా దుండగులు కూడా ఆమె వెనకే లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. శ్రీదేవి భర్త దుర్యోధన వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా కత్తితో దాడికి పాల్పడ్డారు. ఇంటి తలుపులు మూసివేసి కత్తులు, తుపాకీతో బెదిరించి దంపతులను భయభ్రాంతులకు గురిచేశారు. శ్రీదేవి మెడపై కత్తి పెట్టి నాలుగు తులాల బంగారు చైను, తులం పుస్తెల తాడు, కొంత నగదు అపహరించి అక్కడినుంచి పరారయ్యారు. ఈ క్రమంలో కత్తిని అక్కడే వదిలేశారు. దుండగులు పారిపోయిన వెంటనే బాధితులు పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారంతా ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులకు సపర్యలు చేసి పోలీసులకు సమాచారం అందజేశారు. పాతపట్నం సీఐ వినోద్‌బాబు, ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు, మెళియాపుట్టి ఏఎస్‌ఐ నర్సింగరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మెళియాపుట్టితో పాటు ఒడిశా ప్రాంతం వైపు గాలింపు చర్యలు ప్రారంభించారు. మెళియాపుట్టి – టెక్కలి మార్గంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా, ఎన్నడూ లేని విధంగా మెళియాపుట్టి ప్రాంతంలో దోపిడీ జరగడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కాగా, డేగలపోలూరు వద్ద జరిగిన దోపిడీ ఘటనపై గురువారం క్లూస్ టీమ్ దర్యాప్తు చేయనుందని పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలం వద్ద దుండగుల కత్తితో పాటు కీలకమైన ఆధారాలు పోలీసులకు లభించాయి.



గాయాలు చూపిస్తున్న బాధితుడు దుర్యోధన



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

స్వర్ణ కంకణంతో గురువుకు సత్కారం



చంద్రశేఖర్‌శర్మను సన్మానిస్తున్న శిష్యులు

కోటబొమ్మాళి: స్థానిక మెయిన్ రోడ్డుకు చెందిన అష్టావధాని సుసరాపు చంద్రశేఖర్‌శర్మకు అతని శిష్యులు బుధవారం స్వర్ణ కంకణం బహూకరించి ఘనంగా సన్మానించారు. కొత్తపేటలోని శివకేశవ ఆలయ ప్రాంగణంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో వేదపండితులు అంపోలుకు చెందిన రుద్రకోటీశ్వరశర్మ, శ్రీకాకుళం పట్టణానికి చెందిన సుసరాపు దుర్గాప్రసాద్‌శర్మ చేతులమీదుగా చంద్రశేఖర్‌శర్మ చేతికి స్వర్ణ కంకణాన్ని తొడిగారు. చంద్రశేఖర్‌శర్మ అష్టావధానం, హరికథలు, పౌరానిక నాటకాలు, కవిత్వంలో ప్రావీణ్యత చూపారని, సుమారు 300 మంది శిష్యులకు వేదవిద్యను నేర్పించారని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వనమాలి శాంతారావు, తేన్నేటి సతీల్‌వర్మ, సుసరాపు గణపతిశర్మ పాల్గొన్నారు.

హిందూ ట్రోఫీలో సూర్యకిరణ్ ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖపట్నంలోని వీడీసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న హిందూ ట్రోఫీలో జిల్లాకు చెందిన క్రికెటర్ మద్దెల సూర్యకిరణ్ ప్రతిభ కనబర్చాడు. విశాఖపట్నంతో జరుగుతున్న మ్యాచ్‌లో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన సూర్యకిరణ్ 125 బంతుల్లో 187 పరుగులు చేసి శభాష్ అనిపించాడు. ఇందులో 19 బౌండ్రీలు, పది సిక్సర్లు ఉన్నాయి.



మద్దెల సూర్యకిరణ్

గతంలో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు..

ఇటీవల జరిగిన టీ–20 మ్యాచ్‌లో ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టి సంచలనం నమోదు చేసిన సూర్యకిరణ్.. అదే మ్యాచ్‌లో 46 బంతుల్లో 134 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. తాజాగా విశాఖతో జరిగిన మ్యాచ్‌లో మరోసారి భారీ సెంచరీతో కదంతొక్కి సెలక్టర్లను సైతం ఆకట్టుకున్నాడు. సూర్యకిరణ్ టెక్కలిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. శ్రీకాకుళం నగరంలో నివాసం ఉంటున్న సూర్యకిరణ్ తండ్రి మద్దెల ప్రసాద్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, తల్లి విజయలక్ష్మి గృహిణి.

ఆర్మీక్యాంటీన్ ప్రారంభోత్సవ తేదీ మార్పు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్మీ క్యాంటీన్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 20న ఇండియన్ ఆర్మీ క్యాంటీన్ ప్రారంభిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం జాయింట్ సెక్రటరీ అట్టాడ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ నెల 27న ప్రారంభించాలని నిర్ణయించినా.. హైదరాబాద్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తేదీ మార్చినట్లు పేర్కొన్నారు. కాశీబుగ్గ రైల్వే ఎల్‌సీ గేటు సమీపంలో చినబాడాం రెవెన్యూ పరిధిలో ఈ క్యాంటీన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930–00
బంగారం(22కి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225

స్టాఫ్ నర్సుల ఎంపిక నిలుపుదల

- తప్పులతో తుది జాబితా
- అన్యాయం జరిగిందని నర్సుల నిరసన
- సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- 'సాక్షి'లో కథనం రావడంతో ఉలికిపాటు
- జాబితాను మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు
- అర్హులకు అన్యాయం జరగదంటున్న ఆర్డీ



మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సులు, వెయిటేజీ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగులు బుధవారం కూడా తన నిరసన గళం వినిపించారు. దాదాపు 30 నుంచి 40 మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదని విషయం బయటకు రావడంతో.. ఈ జాబితాను పునఃపరిశీలన కోసం అధికారులు భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. స్టాఫ్ నర్సుల ఎంపికలో గందరగోళంపై బుధవారం 'సాక్షి'లో కథనం రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తప్పుల తడకలతో కూడిన 172 మంది అభ్యర్థుల జాబితాను మళ్లీ పరిశీలన చేస్తున్నారు. కొంత మందికి అనవసరంగా ఎలా మార్కులు కలిశాయన్న దానిపై యంత్రాంగం దృష్టి పెట్టింది. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విశాఖ చేరుకుని జాబితాను పరిశీలిస్తున్నారు.

సిబ్బంది తీరుపై మండిపాటు..

స్టాఫ్ నర్సుల పోస్టుల కోసం ఇప్పటివరకు నాలుగు సార్లు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జాబితాను తయారు చేశారు. జీఓ ప్రకారం జాబితా తయారు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. ఎంపికలో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులను తప్పించడం, అనర్హులను అందలం ఎక్కించడం కోసం సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి. ఎంపికైన 172 మందిలో 100 మంది సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలించారు. బుధవారం మరో 30 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. జాబితాను పునఃపరిశీలన చేస్తున్న క్రమంలో ఇందులో ఎంత మంది పేర్లు ఉంటాయో.. ఊడుతాయో తెలియని పరిస్థితి. కాగా.. ఎంపిక జాబితా రూపొందించడంలో సిబ్బంది తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. తమ జీవితాలతో సిబ్బంది చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి మార్కులు కలపడం, మరోసారి తొలగించడం, ఎంపిక జాబితాలో కొందరి పేర్లు ఇప్పుడు తొలగించడం.. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ..

పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పని చేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మెరిట్ లిస్ట్‌కు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమాసుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్దుతున్నారు. అమరావతి నుంచి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా ఇందుకు సహకారం అందిస్తున్నారు. దీంతో కొత్త జాబితా కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. కాగా..అర్హులకు అన్యాయం జరగదని డాక్టర్ ఉమా సుందరి హామీ ఇస్తున్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం మతత్రయ ఏకాదశి సందర్భంగా ఆదిత్యుని కల్యాణ సేవ ఘనంగా జరిగింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణమూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో వెండి సింహవాహనంపై ఉంచి వేదమంత్రోచ్చారణలు, మంగళధ్వనుల మధ్య అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వి.హరిసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ సేవ నిర్వహిస్తున్న శంకరశర్మ బృందం

విశాఖ రాజధానితో ఏఓబీ అభివృద్ధి



సున్నారెడ్డి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్

కంచిలి: విశాఖపట్నం రాజధాని కావడం వల్ల వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు వాటిని ఆనుకొని ఉన్న ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతాయని ఏపీ రాష్ట్ర పరిపాలన వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. ఒడిషా సరిహద్దు గ్రామాలైన సున్నారెడ్డి, అభయపూర్, జరడా బ్లాక్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడుతూ రాజధాని వచ్చాక విశాఖపట్నంలో అనేక నిర్మాణాలు జరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రధానంగా ఐటీ పరిశ్రమ వృద్ధి చెంది దూరప్రాంతాలైన బెంగళూరు, పూణె, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భగవతి పాణిగ్రాహి, హెడ్ మాస్టర్ డి.పృథ్వీరాజ్, యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివాజీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో వర్సిటీ ప్రగతి



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అందరి కృషితోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రగతి సాధిస్తోందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. విశ్వవిద్యాలయం వీసీగా రెండేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా సెమినార్ హాలులో బుధవారం బోధన, బోధనేతర సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 325 మందికి వసతి కల్పించే హాస్టల్ భవన పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలో ఒడియా పీఠం ప్రారంభిస్తామన్నారు. ఈ–ఆఫీస్, ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపు పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మెరుగైన విద్యా ప్రమాణాలు తీసుకువచ్చి జాతీయ స్థాయిలో ఉత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఉదయ్‌భాస్కర్, పాలక మండలి సభ్యులు స్వప్నవాహిణి, చిన్నారావు, పద్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో టెక్కలికి చెందిన ఆటో డ్రైవర్ బబ్బుల్లా మృతిచెందగా.. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన యువకుడు పేరాడ పవన్ (19 తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం పవన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ బబ్బుల్లా మృతదేహానికి అతని భార్య జగదీశ్వరి బుధవారం తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుమారులు చిన్నపిల్లలు కావడంతో ఆమె తలకొరివిపెట్టి భర్త రుణాన్ని తీర్చుకున్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ జి.ఆర్.రాధిక
- పరీక్ష కేంద్రాల పరిశీలన



శ్రీకాకుళం క్రైమ్: ఆదిత్య డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక తదితరులు

శ్రీకాకుళం క్రైమ్: ఈ నెల 22న జరగనున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక చెప్పారు. నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గట్టి భద్రతా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం పట్టణంలో పరీక్ష కేంద్రాలుగా కేటాయించిన ఆదిత్య, భాష్యం, చైతన్య తదితర కళాశాలలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద నిబంధనలు అనుసరించేలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూడాలన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేంద్ర మాతే, ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై బలివాడ గణేష్ ఉన్నారు.

టెక్కలిలో..

టెక్కలి: టెక్కలి మండలంలో కేటాయించిన 14 కేంద్రాలల్లో కొన్నింటిని ఎస్పీ పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీటీసీ డీఎస్పీ జి.శ్రీనివాసరావు, టెక్కలి సీఐ ఎస్.సూర్యచంద్రమౌళి, ఎస్సై ఎల్.రామకృష్ణ ఉన్నారు.

కారు ఢీకొని రైతు దుర్మరణం



సింహాచలం మృతదేహం

కోటబొమ్మాళి: కారు ఢీకొని రైతు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన నారాయణవలస గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణవలస కాలనీకి చెందిన రైతు ఉర్జాన సింహాచలం (56) బుధవారం తన వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. నరసన్నపేట నుంచి చల్లపేట వైపు వేగంగా వెళ్తున్న కారు అతన్ని బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన సింహాచలాన్ని 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమారైలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ విశ్వేశ్వరరావు తెలిపారు.

మానవత్వం పరిమళించిన వేళ..

ఇచ్ఛాపురం: అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం మిగిలే ఉందని నిరూపించారు ఇచ్ఛాపురం పోలీసుస్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ టి.రామారావుతోపాటు కొంతమంది స్థానికులు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని దాసన్నపేట కూడలి వద్ద సుమారు 70 ఏళ్ల వృద్ధుని మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇచ్చారు. పోలీసులు వివరాలు సేకరించగా వారం రోజులుగా పట్టణ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకున్న వ్యక్తిగా గుర్తించారు. అయితే అనాథ అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ టి.రామారావుతోపాటు కొంతమంది స్థానిక యువకులు, మున్సిపల్ సిబ్బంది సహాయంతో వృద్ధుని మృతదేహాన్ని బాహుదానది వద్దకు తీసుకెళ్లి హిందూ సంప్రదాయ పద్ధతిలో కర్మకాండలు పూర్తిచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్నాథం సహకరించారు. హెడ్‌కానిస్టేబుల్ రామారావును సీఐ ఆర్ ఈసీహెచ్ ప్రసాద్, పట్టణ ఎస్సై కె.గోవిందరావు ఇతర సిబ్బంది అభినందించారు.



అనాథ మృతదేహానికి కర్మకాండలు నిర్వహిస్తున్న హెచ్‌సీ రామారావు తదితరులు

చోరీపై కేసు నమోదు

టెక్కలి రూరల్: తన ఇంట్లో చోరీ జరిగిందని స్థానిక అయ్యప్పనగర్‌లో నివాసముంటున్న కొత్తపల్లి చిన్నమ్మడు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. కుమార్తెతో కలిసి చిన్నమ్మడు అయ్యప్పనగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటోంది. మంగళవారం ఆదిఆంధ్రవీధిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచిఉండడంతోపాటు వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించారు. బీరువా తాళం సైతం పగలగొట్టి అందులో ఉంచిన అరతులం బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్టు గుర్తించిన చిన్నమ్మడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. టెక్కలి ఎస్సై రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

యువత మత్తుకు బానిస కావద్దు

కాశీబుగ్గ: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద గ్రీన్‌ఆర్మీ సభ్యులు రూపొందించిన 'ఒక్క అడుగు' అనే షార్ట్‌ఫిల్మ్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచి భావితరాలకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాలరావు, గౌరవాధ్యక్షుడు బత్తిన ఓంకార్, పలాస సినిమా నటుడు రామకృష్ణ, ప్రభుత్వ ఉపాధ్యాయులు బోకర దుర్యోధన, కిషోర్‌కుమార్ పాత్రో, ఇరిగేషన్ శాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ నీలాపు ఉపేంద్రరెడ్డి, దాసరి శ్రీనివాసరావు, పారిశుద్ధ్య కార్మికుల సంఘ నాయకులు చింతల మురుగన్ తదితరులు పాల్గొన్నారు.



ఒక్క అడుగు షార్ట్‌ఫిల్మ్‌ను విడుదల చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

సాయం చేసినప్పుడే సంతృప్తి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: నిరుపేదలు, వృద్ధులకు మనవంతుగా సాయం చేసినపుడే సంతృప్తి లభిస్తుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు కింతలి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో 30 మంది పేద విద్యార్థులకు సైకిళ్లను బుధవారం అందజేశారు. అలాగే మహిళలకు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని, క్లబ్ కార్యాలయ ఆవరణలో వైశ్యరాజు అప్పలరాజు విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా కాలంగా అనేక మందికి ప్రయోజనం కలిగించే విధంగా రోటరీక్లబ్ పని చేస్తోందని కితాబిచ్చారు. సమాజ సేవ చేయాలనుకునే వారికి, నమ్మకమైన, సేవే పరమావధిగా పనిచేస్తూ అందరి విశ్వాసం చూరగొన్న సంస్థ రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అని ప్రశంసించారు. అభివృద్ధి విషయానికి వస్తే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని చెప్పారు. సర్వజన ఆస్పత్రికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని, పొట్టి శ్రీరాములు మార్కెట్‌ని అభివృద్ధి చేశామని, ప్రభుత్వాస్పత్రిలో 900 పడకలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. మార్కెట్‌కు సంబంధించి కోటి రూపాయలతో రహదారులు వేశామన్నారు. నగరానికి నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరు చేశామని, అందులో రెండు ప్రారంభించామన్నారు. భవిష్యత్‌లో నగర ప్రజలకు 24 గంటలూ నీరు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పేదలకు ఆకలి, కన్నీరు లేకుండా ప్రభుత్వం చూస్తోందన్నారు. అందరికీ చదువు అందించడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. గూనపాలెం నుంచి రోటరీ క్లబ్‌కు వెళ్లే దారి బాగుండక పోవడంతో సీసీ రోడ్డు వేయించాలని రోటరీక్లబ్ సంస్థ ప్రతినిధులు మంత్రి ధర్మాన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసుతో మాట్లాడి నెల రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు కింతలి నాగేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు జె. వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.సోమేశ్వరరావు, వరదా కొండబాబు, ఎస్. నరసింహమూర్తి, ఐ.కె.రావు, కె.టి.నాయుడు, కె.వి. కామేశ్వరరావు, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా కొవ్వాడ ఉప కలెక్టర్ పి.మురళీకష్ణను నియమిస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవంపై చర్చించారు. కొవ్వాడ ప్రాజెక్టు పనులు పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం చిన్నతుంబయ్యపేటకు చెందిన రావాడ లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణరావు సిమెంట్ బస్తాలు కొనేందుకు స్కూటీపై వెళ్తుండగా.. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న రొమదల గ్రామానికి చెందిన రేగేటి అమర్‌నాథ్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో లక్ష్మణరావు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్పందించి ప్రైవేట్ వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. లక్ష్మణరావు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

ప్రతినెలా సివిల్ రైట్స్ డే

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి:

ఎస్సీ, ఎస్టీల సామాజిక రక్షణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రతినెల కచ్చితంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయిలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై మూడు రోజుల్లోగా నివేదిక అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా డీవీఎంసీ సభ్యులతో బహిరంగ ప్రదేశాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దీనివల్ల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. డీవీఎంసీ సమావేశాల్లో కేవలం అట్రాసిటీ అంశాలను మాత్రమే ప్రస్తావించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీలకు ప్రత్యేకంగా శ్మశానవాటికల కోసం స్థల సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కనీసంగా 50 సెంట్ల నుంచి ఒకఎకరా వరకు స్థలాన్ని గుర్తించి త్వరితగతిన ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. డీవీఎంసీ సమావేశానికి పోలీసులు హాజరు కావడం లేదని, అట్రాసిటీ కేసుల్లో పోలీసులు స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు బి.నారాయణరావు కోరారు. దళితుల భూసమస్యలపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అత్యధికంగా ఎస్సీ, ఎస్టీలు కలిగిన నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని, టెక్కలి అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని, ఐటీడీఏ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు భోజనాలు పెట్టడం లేదని మరో సభ్యుడు బి.ప్రభాకర్రావు ప్రస్తావించారు. మెళియాపుట్టి మండలం చందనగిరిలో గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని మరో సభ్యుడు జి.రమణమూర్తి ప్రస్తావించారు. దళితులకు కేటాయించిన శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురవుతున్నాయని తక్షణమే చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు చల్లా రామారావు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం టెక్కలి మండలంలో పలు ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో సమస్యలపై ఎంపీపీ అట్ల సరోజనమ్మ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్ రెడ్డి